సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం । 14 । డిసెంబర్ । 2024



గురి తప్పకుండా..!
హైదరాబాద్ పరిసర ప్రాంతాలకే పరిమితమైన రైఫిల్ షూటింగ్ శిక్షణ అతి త్వరలోనే జిల్లాలో అందుబాటులోకి రానుంది. 8లో



రికార్డు స్థాయిలో ఉత్పత్తి
కేటీపీఎస్ ఆరో దశలోని 11వ యూనిట్‌లో 100 రోజులుగా నిరంతరాయంగా విద్యుదుత్పత్తి నమోదు చేసి రికార్డు సృష్టించింది. 8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 29°/14°
జిల్లాలో శనివారం పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగానే నమోదైనా.. తెల్లవారు జామున, రాత్రి మాత్రం చలి తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

స్వర్ణ కవచధారుడిగా రామయ్య దర్శనం


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి మూలమూర్తులు స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి శుక్రవారం స్వామివారిని స్వర్ణ కవచాలతో అలంకరిస్తారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి కుటుంబసభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. ఈఓ రమాదేవి ఆలయ మర్యాదలతో స్వాగతం పలకగా, అర్చకులు విజయరాఘవన్ తదితరులు వేదాశీర్వచనం చేశారు.

పోలవరం ముప్పుపై ఉన్నత స్థాయి కమిటీ వేయండి

ఖమ్మంవన్‌టౌన్: ఏపీలో గోదావరిపై నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టుతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాపై తీవ్ర ప్రభావం పడనున్నందున సమస్య పరిష్కారానికి ఉన్నత స్థాయి కమిటీ వేయాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి కోరారు. లోక్‌సభలో శుక్రవారం ఈ విషయాన్ని ప్రస్తావించిన ఆయన కేంద్ర జలశక్తి మంత్రికి విన్నవించారు. పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రభావంతో భద్రాద్రి జిల్లాలోని బూర్గంపాడు, అశ్వాపురం, దుమ్ముగూడెం మండలాల్లోని అనేక ప్రాంతాలు, వ్యవసాయ భూములు మునిగిపోతాయని తెలిపారు. దాదాపు 1,090 ఎకరాలను స్థానికులు కోల్పోవాల్సి వస్తుందని తెలిపారు. కాగా, గోదావరి వరదల నుంచి భద్రాచలం, పరిసర ప్రాంతాలను రక్షించేందుకు గతంలోనే అడ్డుకట్టలను నిర్మించగా, ఇటీవలి అదనపు వరద కట్టల నిర్మాణానికి రూ.4,100 కోట్లను తెలంగాణ ప్రభుత్వం కేటాయించిందని చెప్పారు. ఈమేరకు పోలవరం ప్రాజెక్టు ప్రభావంతో ఎదురుకానున్న సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని నియమించాలని ఎంపీ కోరారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం జిల్లా కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. ఇందులో ప్రధానంగా యాక్సిడెంట్ కేసులు, సివిల్, చీటింగ్, చిట్‌ఫండ్, భూతగాదాలు, వివాహ బంధానికి సంబంధించిన కేసులు, చోరీలు, ట్రాఫిక్ చలాన్, డ్రంక్ అండ్ డ్రైవ్, కుటుంబ తగాదాలు బ్యాంకు, టెలిఫోన్ కేసులు, ఘర్షణ, సైబర్ క్రైమ్ కేసులు రాజీ చేసుకునే అవకాశం ఉందని వివరించారు.

సర్వే సక్రమంగా చేయాలి

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అమలు చేసే ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వేను పకడ్బందీగా చేయాలని జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి అన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని నారంవారిగూడెంలో సర్వే ప్రక్రియను తనిఖీ చేశారు. దరఖాస్తుదారుల ఇళ్ల వద్దకే వెళ్లి వివరాలు యాప్‌లో తప్పులు లేకుండా నమోదు చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి, మధ్యాహ్న భోజ నాన్ని తనిఖీ చేశారు. అశ్వారావుపేటలోని పాత ఎంపీడీఓ కార్యాలయం పురాతన భవనాలు, స్థలాన్ని పరిశీలించి ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్‌ను వివరాలు అడిగితెలుసుకున్నారు. స్థలం అన్యాక్రాంతం కాకుండా అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఉద్యోగులతో సమావేశమై సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఈఓను సత్కరించారు. కార్యక్రమాల్లో ఎంపీఓ సోయం ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు బేస్‌బాల్ క్రీడాకారుల ఎంపికలు

కొత్తగూడెంఅర్బన్: సీఎం కప్ - 2024లో భాగంగా రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు ఈనెల 18న జరుగుతాయని, ఇందుకోసం జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపికలు 15న కలెక్టరేట్‌లో జరుగుతాయని జిల్లా యువజన, క్రీడల అధికారి ఎం.పరంధామరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనే క్రీడాకారులు ముందుగా ఆన్‌లైన్‌లో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. బేస్ బాల్ ఈవెంట్‌లో పాల్గొనే క్రీడాకారులు రిజిస్ట్రేషన్ ప్రక్రియ తర్వాత ఇతర వివరాలకు తమ కార్యాలయంలో లేదా 95054 23226 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

ముక్కోటి పనులు షురూ


ఉత్తర ద్వారం వద్ద పంచ రంగులు వేస్తున్న కార్మికులు

రూ.60 లక్షల నిధులతో భక్తులకు సౌకర్యాలు
- ఈ నెల 31 నుంచి వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు
- ఆన్‌లైన్‌లో సెక్టార్ టికెట్ల విక్రయాలు ప్రారంభం

భద్రాచలం: భూలోక వైకుంఠంగా భావించే భద్రాచలంలో ముక్కోటి ఏకాదశి పనులు ప్రారంభమయ్యాయి. దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శ్రీరామనవమితో పాటు ఈ వేడుకలను కూడా ప్రధాన ఉత్సవాలుగా భావిస్తారు. ఈ నెల 31 నుంచి అధ్యయనోత్సవాలు ప్రారంభం కానుండగా జనవరి 9 వరకు పగటి పూట జరిగే (పగల్‌పత్తు)సేవలు జరుపుతారు. జనవరి 10 నుంచి 20 వరకు రాత్రి పూట జరిగే (రాపత్తు) సేవలు, 21 నుంచి 23 వరకు విలాసోత్సవాలు నిర్వహించనున్నారు. భద్రాచలం దేవస్థానంలో మాత్రమే ప్రత్యేకంగా జరిగే విశ్వరూప సేవ జనవరి 26న నిర్వహించనున్నారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఇప్పటికే సమీక్ష సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. దీంతో అధికారులు పనులు ప్రారంభించారు. కాగా ముక్కోటి ఉత్సవాల నేపథ్యంలో ఈ నెల 31 నుంచి జనవరి 10 వరకు బేడా మండపంలో స్వామివారి నిత్యకల్యాణాలు రద్దు చేయనున్నారు.

రూ.52,59,170 నిధులతో టెండర్లు

ముక్కోటి ఉత్సవాలను అంగరంగ వైభవోపేతంగా నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఉత్సవ ఏర్పాట్లపై ఈఓ ఎల్.రమాదేవి దృష్టి సారించారు. రూ.52,59,170 నిధులకు సంబంధించిన పనులకు కాంట్రాక్టర్లకు టెండర్లు కేటాయించారు. ఆలయం, పర్ణశాల, గోదావరి ఘాట్‌ల వద్ద పెయింట్ పనులు, గోపురం, నిత్యకల్యాణ మండపం, వైకుంఠ ద్వారం, గోశాలలకు పంచ రంగులు, చలువ పందిళ్ల నిర్మాణం, భద్రాచలంలో మూడు వైపులా స్వాగత ద్వారాలు, పూల డెకరేషన్ తదితర పనులు ఇందులో ఉన్నాయి. వీటిలో పంచరంగుల పనులు ఇప్పటికే ప్రారంభం కాగా, ఇతర పనులు ప్రారంభం కావాల్సి ఉంది. తెప్పోత్సవం రోజున స్వామి వారు గోదావరిలో విహరించే హంస వాహనం అలంకరణ పనులు, ట్రయల్ రన్‌లను పూర్తి చేయాల్సి ఉంది.

మొదలైన టికెట్ల విక్రయం

ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకోవాలనుకునే భక్తులకు వివిధ సెక్టార్ల టికెట్ల విక్రయం బుధవారమే ప్రారంభమైంది. రూ. 250, రూ.500, రూ.1,000, రూ. 2వేల విలువైన టికెట్లను భక్తులకు అందుబాటులో ఉంచారు. ఇక ప్రత్యక్షంగా ఉత్తర ద్వార దర్శనం చేసుకోలేని భక్తులకు పరోక్ష సేవలను సైతం ఆన్‌లైన్‌లో ఉంచారు. ఇందుకోసం రూ.2 వేల విలువైన టికెట్లను విక్రయానికి ఉంచారు. గతేడాది ఈ టికెట్ల విక్రయం ద్వారానే స్వామి వారికి అధిక ఆదాయం సమకూరింది. టికెట్లను www:// bhadradritemple. telangana. gov. in వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న భక్తులు ఈ నెల 25 నుంచి వచ్చే నెల 10వ తేదీ ఉదయం 5గంటల వరకు తానీషా కల్యాణ మండపంలోని సీఆర్‌ఓ కార్యాలయంలో టికెట్లు పొందవచ్చని ఆలయ అధికారులు తెలిపారు.

రోజుకో అవతారం.. భద్రాద్రిలో ప్రత్యేకం

ముక్కోటి ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా జరిగే పగల్ పత్తు ఉత్సవాల్లో స్వామివారు రోజుకో అవతారంలో దర్శనమివ్వడం భద్రాచలంలోనే ప్రత్యేకత. విశేషంగా అలంకరించిన స్వామివారిని మిథిలా స్టేడియంలో ఏర్పాటు చేసిన వేదికపై కొలువుదీర్చి భక్తులకు దర్శనం కల్పిస్తారు. అవతారాల అనంతరం రోజుకో ప్రభుత్వ శాఖ ఆధ్వర్యంలో రాపత్తు సేవలు నిర్వహిస్తారు.

తేదీ	అవతారం
31-12-2024	మత్స్యావతారం
01-01-2025	కూర్మావతారం
02-01-2025	వరాహావతారం
03-01-2025	నరసింహావతారం
04-01-2025	వామనావతారం
05-01-2025	పరశురామావతారం
06-01-2025	శ్రీరామావతారం
07-01-2025	బలరామావతారం
08-01-2025	శ్రీ కృష్ణావతారం
09-01-2025	గోదావరి నదిలో తెప్పోత్సవం

ముక్కోటి పనులు వేగంగా పూర్తి చేస్తాం



ముక్కోటి పనులు వేగంగా పూర్తి చేస్తాం. ఇప్పటికే టెండర్ల ప్రక్రియను పూర్తి చేయగా, వీటిలో కొన్ని పనులు ప్రారంభమయ్యాయి. భక్తులకు ఇబ్బందులు లేకుండా, ప్రశాంతంగా ఉత్తర ద్వార దర్శనం చేసుకునే విధంగా ఏర్పాట్లు చేస్తాం. ఈ ఏడాది త్వరగానే భక్తుల కోసం ఆన్‌లైన్‌లో టికెట్ల విక్రయం చేపట్టాం.

– ఎల్ రమాదేవి, ఈఓ, రామాలయం

స్వయం సమృద్ధి సాధించాలి

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల
- అల్లిపల్లి గ్రామస్తులకు అభినందనలు


మాట్లాడుతున్న మంత్రి తుమ్మల పక్కన ఎమ్మెల్యే జారే, అధికారులు

దమ్మపేట : ప్రజలంతా ఏకతాటిపై నిలిచి స్వయం సమృద్ధి సాధించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని అల్లిపల్లిలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయం, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాలు, సీసీ రోడ్లు, కల్వర్టులను స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అల్లిపల్లి గ్రామస్తులే స్వయంగా విరాళాలతో పాఠశాలను నిర్మించుకోవడం అభినందనీయమని అన్నారు. 40 ఎళ్ల క్రితం నాటి వ్యవసాయంతో పోలిస్తే నేడు పామాయిల్ సాగుతో రైతులు ఆర్థికంగా ముందంజలో ఉన్నారని తెలిపారు. సరిహద్దులో ఉన్న ఆంధ్రతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు గ్రామాలకు దమ్మపేట మండలం వ్యవసాయ రంగంలో ఆదర్శంగా నిలిచిందన్నారు. మండలం అంతా ఏజెన్సీ ప్రాంతమేనని, తాతల కాలం నుంచి సాగులో ఉన్న రైతులను అధికారులు ఇబ్బందులకు గురిచేయొద్దని సూచించారు. జూదం వంటి సంఘ వ్యతిరేక కార్యకలాపాలను తాను ఎప్పుడూ ప్రోత్సహించనని, అయితే సంక్రాంతి సందర్భంగా మూడు రోజుల పాటు వ్యాపార రీతిలో లేని కోడి పందేల నిర్వహణ సాధారణమేనని అన్నారు. తమ కోసం పనిచేసిన అధికారులను ప్రజలు గుండెల్లో పెట్టుకుంటారని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే ఆదినారాయణ మాట్లాడుతూ.. స్వయంగా రైతు అయిన మంత్రి తుమ్మల, వ్యవసాయ రంగం అభివృద్ధికి శాయశక్తులా కృషిచేశారని పేర్కొన్నారు. దేశంలోనే ఎన్నడూ లేనంత రీతిలో రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేసిన అనితర సాధ్యుడుగా తుమ్మలను కొనియాడారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్ శాఖల ఉన్నతాధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వాసం రాణి, పామాయిల్ సలహాదారుల కమిటీ సభ్యుడు ఆలపాటి రామచంద్రప్రసాద్, సొసైటీ చైర్మన్ ఎల్లిన రాఘవరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మద్దిశెట్టి సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తుమ్మల పర్యటన..

మండల పరిధిలోని పూసుకుంట, అంకంపాలెం, గండుగులపల్లి గ్రామాల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శనివారం పర్యటించనున్నారు. ఈ మేరకు మంత్రి క్యాంప్ కార్యాలయం నుంచి ప్రకటన వెలువడింది.

తహసీల్దార్ల జిల్లా కమిటీ ఎన్నిక


నూతన కార్యవర్గంతో రాష్ట్ర నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ తహసీల్దార్ అసోసియేషన్(టీజీటీఏ) ఆత్మీయ సమావేశం స్థానిక మధువన్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఇల్లెందు తహసీల్దార్ కె.రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా మామిడి అశోక్ కుమార్(దుమ్ముగూడెం), అసోసియేట్ ప్రెసిడెంట్‌లుగా ఇమ్మానియేల్(గుండాల), ముజాహిద్(బూర్గంపాడు), వైస్ ప్రెసిడెంట్‌గా బి.గన్యానాయక్ (డీఏఓ భద్రాచలం), కె.రాజారావు (డీఏఓ కొత్తగూడెం), నాగభవాని(టేకులపల్లి), ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా నరేష్(దమ్మపేట), నాగప్రసాద్(కరకగూడెం), జాయింట్ సెక్రటరీగా సంధ్యారాణి(చంద్రుగొండ), ట్రెజరీగా వి.రాఘవరెడ్డి(మణుగూరు) ఎన్నికయ్యారు. ఇంకా అడ్వైజరీ బోర్డు సభ్యులుగా పి.కృష్ణ (చుంచుపల్లి) ఎం.శ్రీనివాస్(చర్ల)తో పాటు ఈసీ మెంబర్లుగా శకుంతల(ఆళ్లపల్లి), స్వాతిబిందు (జూలూరుపాడు) స్టేట్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా భద్రాచలం తహసీల్దార్ టి.శ్రీనివాస్ ఎన్నికయ్యారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా టీటీజీఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాములు, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వి.బిక్షం, వీఆర్‌ఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేందర్, టీజీటీఏ రాష్ట్ర కోశాధికారి శంకర్ శ్రీను తదితరులు హాజరయ్యారు.

ఓటరు నమోదుపై దృష్టి పెట్టండి


సమీక్షలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి, పక్కన కలెక్టర్ పాటిల్, పీఓ రాహుల్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్

- ఏజెన్సీ ప్రాంతాల్లో ఓటుహక్కుపై అవగాహన కల్పించాలి
- రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి


సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో ఓటర్ నమోదుపై అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన రెడ్డి అన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన కలెక్టరేట్‌లో ఎన్నికల విభాగం అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో నూరు శాతం ఓటరు నమోదు కార్యక్రమాన్ని పూర్తిచేయాలని సూచించారు. ప్రధానంగా ఏజెన్సీ ప్రాంత ప్రజలకు ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలని అన్నారు. దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లను గుర్తించి నేరుగా అధికారులే వెళ్లి ఓటు కోసం అవగాహన కల్పించాలని ఆదేశించారు. అలాంటి దరఖాస్తులను ఈనెల 25 వరకు పరిష్కరించాలని చెప్పారు. బీఎల్‌ఓలు ప్రతి రికార్డును అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని, పై అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. వివిధ రాజకీయ పార్టీలతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తూ సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. బీఎల్‌ఓ వ్యవస్థను పటిష్టపర్చేలా చర్యలు చేపట్టాలని తహసీల్దార్లకు సూచించారు. ఎమ్మెల్సీ ఓటరు నమోదును సైతం మరింత చురుగ్గా నిర్వహించాలన్నారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ.. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల వారీగా పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలు, గతంలో ఓటరు నమోదు కోసం జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలు, ప్రస్తుతం చేపడుతున్న అంశాలను వివరించారు. అంతకుముందు కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్, అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ తదితరులు సుదర్శన్‌రెడ్డికి పూలమొక్కలు అందించి ఘనంగా స్వాగతం పలికారు.

ఎన్నికల అధికారిని కలిసిన ఎస్పీ

కొత్తగూడెంఅర్బన్: జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డిని ఎస్పీ రోహిత్‌రాజ్ శుక్రవారం ఇల్లెందు గెస్ట్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు.

రఘునాథపాలెం అడవుల్లో పులి సంచారం !

పాదముద్రలను గుర్తించిన అధికారులు


పులి పాద ముద్రలను గుర్తిస్తున్న అటవీ అధికారులు

కరకగూడెం: కొన్ని రోజులుగా కరకగూడెం, గుండాల, తాడ్వాయి, మంగపేట మండలాల పరిధి అటవీ ప్రాంతాల్లో పెద్దపులి సంచరిస్తోందనే ప్రచారం నేపథ్యంలో అటవీ అధికారులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో కరకగూడెం మండలం రఘునాథపాలెం అటవీ ప్రాంతంలో పెద్దపులి అడుగుజాడలను గుర్తించినట్లు ఏడూళ్ల బయ్యారం రేంజర్ ఉపేందర్ శుక్రవారం తెలిపారు. గతేడాది పులి సంచరించిన దారిలోనే మళ్లీ వచ్చినట్లు సమాచారం ఉందన్నారు. పాదముద్రల ఆధారంగా పులి ఎటువైపు వెళ్లిందో గుర్తించేందుకు శనివారం కూడా తనిఖీలు చేపడుతామని, ప్రజలు ఒంటరిగా అడవిలోకి వెళ్లొద్దని సూచించారు. కాగా, మల్లూరు నుంచి తిమ్మాపురం మీదుగా రఘునాథపాలెం అడవిలోకి మగ పెద్ద పులి వచ్చినట్లు తెలుస్తోంది.

అప్రమత్తంగా ఉండండి..

గుండాల : కిన్నెరసాని అభయారణ్యంలోకి పెద్ద పులి ఎప్పుడైనా రావచ్చని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు గుండాల, ఆళ్లపల్లి, కరకగూడెం మండలాల్లో డప్పు చాటింపు వేయిస్తున్నారు. పశువుల మేతకు కాపర్లు అడవులకు వెళ్లొద్దని, చేలకు వెళ్లే రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలని, చీకటి పడక ముందే ఇంటికి చేరుకోవాలని సూచిస్తున్నారు. వాహనదారులు సైతం రాత్రి వేళ ప్రయాణం చేయొద్దని చెబుతున్నారు. ఎక్కడైనా పులి కానీ, అడుగులు కానీ కనిపిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు.

షష్టిపూర్తి వేడుకలకు ముస్తాబు

- వ్యవసాయ యూనివర్సిటీ ఏర్పాటై 60 ఏళ్లు
- 'పేట' కళాశాలలో నేడు సంబురాలు
- హాజరు కానున్న మంత్రి తుమ్మల, పూర్వ విద్యార్థులు



అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల

అశ్వారావుపేట: అశ్వారావుపేటకు తెలుగు రాష్ట్రాల్లో తగిన గుర్తింపు ఉందంటే అది వ్యవసాయ కళాశాల పుణ్యమే. 1964లో హైదరాబాద్‌లో వ్యవసాయ యూనివర్సిటీ ఏర్పాటు కాగా, దానికి అనుబంధంగా 1989లో అశ్వారావుపేటలో ఈ కాలేజీకి శంకుస్థాపన చేశారు. యూనివర్సిటీ ఏర్పాటై 60 ఏళ్లు పూర్తి కావడంతో దాని అనుబంధ క్యాంపస్‌ల్లోనూ షష్టిపూర్తి వేడుకలు చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో అశ్వారావుపేట కాలేజీ సైతం శనివారం నాటి వేడుకలకు ముస్తాబైంది.

35 ఏళ్ల క్రితం.. 35 మంది విద్యార్థులతో..

1989లో చిన్నతరహా నీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు చొరవతో అశ్వారావుపేటలో వ్యవసాయ కళాశాల ఏర్పాటైంది. ఆ ఏడాది జూలై 17న జరిగిన మంత్రివర్గ సమావేశంలో నూతన వ్యవసాయ కళాశాలల ఏర్పాటు ప్రతిపాదన రాగా అశ్వారావుపేటకు కావాలని తుమ్మల కోరడంతో నాటి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు మంజూరు చేశారు. అప్పట్లో పాలకేంద్రంగా పిలిచే పశుపోషణ శాల ప్రాంగణాన్ని కళాశాలకు కేటాయించి హుటాహుటిన 35 మంది బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులతో ఆగస్టు 22న కళాశాలను ప్రారంభించారు. అలా మొదలైన కాలేజీ ప్రస్తుతం 420 మంది విద్యార్థులతో 250 ఎకరాల్లో అన్ని రకాల వ్యవసాయ, ఉద్యాన, మసాలా దినుసుల పంటలతో కళకళలాడుతోంది. ఏటా మౌలిక వసతులు పెంచుతుండగా.. ప్రస్తుతం అన్ని రకాల ప్రయోగశాలలు, క్రీడా ప్రాంగణం, సౌకర్యవంతమైన హాస్టళ్లు ఉన్నాయి. ఇప్పటి వరకు ఈ కళాశాలలో 2,500 మంది విద్యనభ్యసించారు. రెండేళ్ల పాటు పీజీ కోర్సు నిర్వహించినా పలు కారణాలతో యూనివర్సిటీ తొలగించగా ప్రస్తుతం ఏజీ బీఎస్సీ కోర్సు మాత్రమే కొనసాగుతోంది.

ఇక్కడ చదివిన ఎంతోమంది ప్రముఖులు..

అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో విద్యనభ్యసించిన వారిలో 1989 బ్యాచ్‌కు చెందిన వై.నాగిరెడ్డి ఐపీఎస్ అధికారిగా కొనసాగుతున్నారు. 1990 బ్యాచ్‌కు చెందిన వెంకటరమణ కెనడాలో సైంటిఫిక్ ఫ్యాకల్టీ మెంబర్‌గా ఉన్నారు. 1991 బ్యాచ్‌కు చెందిన ఠాగూర్ వర్మ గ్రూప్1 అధికారిగా పని చేస్తున్నారు. అశోక్ కుమార్, హరికృష్ణారెడ్డి ఇక్రిశాట్‌లో సీనియర్ సైంటిస్టులుగా ఉన్నారు. ఈ కళాశాలలో చదివి ఇక్కడే రెండు దశాబ్దాలకు పైగా అధ్యాపకులుగా పనిచేసిన గోపాలకృష్ణమూర్తి యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌కు సాంకేతిక సలహాదారుగా వ్యవహరిస్తున్నారు. మరో 170 మంది వివిధ ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. అత్యధిక జీపీఏ సాధించిన ఈ కళాశాల విద్యార్థులకు యూనివర్సిటీ స్థాయిలో 20 బంగారు పతకాలు లభించాయి. ఇక్కడ చదువుకున్న వారే కాదు.. చదువు చెప్పిన వారూ ప్రతిభావంతులే. ముగ్గురు అధ్యాపకులు ఐదు స్పాన్సర్‌షిప్ ప్రాజెక్టులను సాధించగా, ఏడుగురు అధ్యాపకులు పది మెరిటోరియస్ అవార్డులను కైవసం చేసుకున్నారు.

జాతి రత్నాలను అందించింది..

అశ్వారావుపేటరూరల్: వ్యవసాయ విశ్వవిద్యాలయం ఇప్పటివరకు ఎంతో మంది విద్యార్థులను జాతి రత్నాలుగా తీర్చిదిద్దిందని అగ్రికల్చర్ డీన్ జె.సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 1964లో యూనివర్సిటీ ఏర్పాటుకాగా, దాని పరిధిలోని అన్ని కాలేజీల్లో కలిపి ఇప్పటివరకు 32,300 మంది విద్యభ్యసించారని వివరించారు. వీరిలో అనేక మంది ఐపీఎస్, ఐఏఎస్‌లు, శాస్త్రవేత్తలు, ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని చెప్పారు. యూనివర్సిటీ పరిధిలో వ్యవసాయ విద్యతోపాటు రైతులకు సాగు సూచనలు, దత్తత గ్రామాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు ఎన్నో చేపట్టామని తెలిపారు. అశ్వారావుపేట కాలేజీలో నేడు జరిగే వేడుకల్లో రైతులతో ముఖాముఖి, వ్యవసాయ క్షేత్ర సందర్శన, ఉత్పత్తులతో ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట కళాశాల డీన్ హేమంత్‌కుమార్, విశ్వ విద్యాలయం అధికారి గోపాలకృష్ణమూర్తి ఉన్నారు. కాగా, పామాయిల్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రామచంద్రప్రసాద్, నాయకులు బండి భాస్కర్ మాట్లాడుతూ.. మంత్రి తుమ్మల ముందుచూపుతో 35 ఏళ్ల క్రితమే వ్యవసాయ కళాశాలను మంజూరు చేయించారని అన్నారు. నేడు మళ్లీ మంత్రి చేతుల మీదుగా వేడుకలను జరుపుకోవడం హర్షణీయమన్నారు. మావేశంలో సొసైటీ చైర్మన్ నిర్మల పుల్లారావు, కాంగ్రెస్ నాయకులు మొగళ్లపు చెన్నకేశవరావు, సత్యనారాయణ చౌదరి, ఎస్‌కే పాషా, పాలవలస జీవన్‌రావు పాల్గొన్నారు.


వ్యవసాయ కళాశాల ప్రారంభోత్సవం సందర్భంగా పండ్లను పరిశీలిస్తున్న నాటి, నేటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

గ్రూప్ - 2 పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 అమలు

కొత్తగూడెంఅర్బన్ : ఈనెల 15, 16 తేదీల్లో నిర్వహించనున్న టీజీపీఎస్సీ గ్రూప్ – 2 పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బీఎన్‌ఎస్‌ఎస్(భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) యాక్ట్ అమలు చేస్తామని ఎస్పీ రోహిత్ రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 38 కేంద్రాల్లో నిర్వహించే ఈ పరీక్షల సందర్భంగా 15వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 16వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. జిల్లాలో 13,465 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని, కొత్తగూడెంలో 25, పాల్వంచలో 13 కేంద్రాల వద్ద 300 మందితో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు గుంపులుగా ఉండరాదని, ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, మైకులు, డీజేలు, ఊరేగింపులు, ధర్నాలు, ప్రచారాలకు అనుమతి లేదని వివరించారు. పరీక్ష సమయంలో సమీపంలోని ఇంటర్నెట్, జిరాక్స్ కేంద్రాలు, స్టేషనరీ దుకాణాలు మూసివేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్లుప్తంగా

16న బాక్సింగ్ జట్టుకు ఎంపిక పోటీలు

కొత్తగూడెంఅర్బన్: సీఎం కప్‌నకు సంబంధించి బాక్సింగ్ జట్టు ఎంపికలు ఈ నెల 16న ప్రగతి మైదానంలో జరుగుతాయని ఆర్గనైజింగ్ సెక్రెటరీ రమేశ్, హెడ్ కోచ్ సత్యబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్, జూనియర్ బాలురు, బాలికలతోపాటు సీనియర్ మెన్ పోటీల్లో విజేతలకు ఈ నెల 27 నుంచి జనవరి 2 వరకు ఎల్బీ స్టేడియంలో స్టేట్ మీట్ ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 92999 03203, 80393 78886 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ విరమించుకోవాలి


ధర్నా చేస్తున్న జేఏసీ నాయకులు

పాల్వంచ: ఉత్తరప్రదేశ్, చండీఘడ్ రాష్ట్రాల్లో ప్రభుత్వం చేపడుతున్న విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ ప్రయత్నాలను విరమించుకోవాలని కేటీపీఎస్ తెలంగాణ పవర్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యుత్ ప్రైవేటీకరణను నిరసిస్తూ నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్, ఇంజనీర్స్ పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలకు నిరసనగా కేటీపీఎస్ అంబేడ్కర్ సెంటర్‌లో నల్లబ్యాడ్జిలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. కేంద్రం విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ చర్యలను మానుకోవాలని, విద్యుత్ సంస్థలు అన్ని ప్రభుత్వ పరిధిలోనే ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమామహేశ్వరరావు, యాస్మిన్, బ్రహ్మజీ, మహేశ్, సీతారామిరెడ్డి, పరశురాం, కోటేశ్వరరావు, మజీద్, రాధాకృష్ణ, వినోద్, వరకోటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీటీపీఎస్ ఉద్యోగుల నిరసన

మణుగూరురూరల్: ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల్లో విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ పవర్ ఎంప్లాయీస్(టీఎస్‌పీఈ) జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం బీటీపీఎస్‌లో నిరసన తెలిపారు. అనంతరం ప్లాంట్‌లోని సర్వీస్ బిల్డింగ్ ఎదుట జరిగిన సమావేశంలో టీఎస్‌పీఈఏ బీటీపీఎస్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరిస్తే సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు భద్రత లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విద్యుత్ ఉద్యోగులందరూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రవిప్రసాద్, రవితేజ, నరేశ్, సాయిరాం, వి.ప్రసాద్, బి.కృష్ణ, వెంకట్రామ్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మినిమమ్ వేజ్‌బోర్డ్ సభ్యుడిగా పిచ్చిరెడ్డి


యారం పిచ్చిరెడ్డి

బూర్గంపాడు: రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి సభ్యుడిగా సారపాకకు చెందిన ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి యారం పిచ్చిరెడ్డి నియమితులయ్యారు. నియామకపు ఉత్తర్వులు శుక్రవారం ఆయనకు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, జనక్‌ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పత్తి కౌంటర్లలో మార్కెట్ అధికారుల తనిఖీలు

టేకులపల్లి: అనుమతి లేకుండా పత్తి కొనుగోలు చేస్తున్న చిల్లర కౌంటర్లపై ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా బోడు పరిసర ప్రాంతాలతో పాటు రామచంద్రునిపేటలో తనిఖీలు చేపట్టి అనుమతి లేకుండా కొనుగో లు చేస్తున్న వ్యాపారికి నోటీసు ఇచ్చారు. అలాగే, కొనుగోలు చేసిన పత్తికి మార్కెట్ ఫీజు ఆధారంగా జరిమానా వసూలు చేయడంతోపాటు కాటాలను స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా అనుమతి లేకుండా కొనుగోలు చేస్తున్న మొక్కజొన్నలను కార్యాలయానికి తరలించారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి నరేశ్‌కుమార్, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, ఉద్యోగులు రంజిత్, మధు, శ్రీను, రమేశ్, చందర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి


అనిల్ (ఫైల్)

మణుగూరుటౌన్ : మణుగూరు పట్టణంలోని తోగ్గూడెం శివారు ప్రాంతంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కానిస్టేబుల్ మృతిచెందాడు. స్థానిక సుందరయ్య నగర్‌కు చెందిన తన్నీరు అనిల్‌కుమార్(35) పాల్వంచలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి ద్విచక్రవాహనంపై మణుగూరుకు వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అనిల్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందగా, మరో బైక్‌పై ఉన్న వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని మణుగూరులోని 100 పడకల ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి కూడా విషమంగా ఉందని సమాచారం. ప్రమాద స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

గురి తప్పకుండా..!

'గూడెం'లో రైఫిల్ షూటింగ్ రేంజ్

- రూ.3.30 లక్షల నిధులతో ఏర్పాటు
- ఇప్పటికే తరగతులు.. త్వరలోనే ప్రారంభం
- విద్యార్థులు పోటీల్లో పాల్గొనేలా తర్ఫీదు


షూటింగ్ నేర్చుకుంటున్న విద్యార్థులు

కొత్తగూడెంరూరల్: జిల్లాలోని లక్ష్మీదేవిపల్లి మండలంలోని శ్రీరామచంద్ర కళాశాలలో వారం రోజుల్లో రైఫిల్ షూటింగ్ రేంజ్ అందుబాటులోకి రానుంది. ఇన్నాళ్లు హైదరాబాద్ చుట్టు పక్కల ప్రాంతాలకు మాత్రమే పరిమితమైన రైఫిల్ షూటింగ్ రేంజ్ లక్ష్మీదేవిపల్లి మండలంలోని శ్రీరామచంద్రకళాశాలలో ఏర్పాటు చేశారు. ఇందుకోసం కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ రూ.3.30 లక్షల నిధులు కేటాయించగా.. ఇప్పటికే 11 ఏళ్లు దాటిన 33 మంది బాలబాలికలకు షూటింగ్ శిక్షణ ఇస్తున్నారు. త్వరలోనే ఈ సెంటర్ అధికారికంగా ప్రారంభం కానుంది.

రెండు విభాగాల్లో..

రైఫిల్ షూటింగ్‌లో ఎయిర్ రైఫిల్, ఎయిర్ పిస్టల్ విభాగాలు ఉంటాయి. ఇందులో జూనియర్లు, సీనియర్లు కేటగిరీలుగా బాల, బాలికలకు శిక్షణ ఇస్తారు. తొలిదశలో పది మీటర్ల రేంజ్‌లో మాత్రమే శిక్షణ ఉంటుంది. రైఫిల్, పిస్టల్‌లో బుల్లెట్లకు బదులు పిల్లెట్స్ వాడతారు. ప్రతి రోజూ ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు ఈ రేంజ్‌లో శిక్షణ ఇస్తుండగా ఒకేసారి నలుగురు క్రీడాకారులు సాధన చేయొచ్చని జిల్లా యువజన, క్రీడల శాఖాధికారి పరంధామరెడ్డి తెలిపారు. ఈ మేరకు జాతీయస్థాయి నైపుణ్యం కలిగిన కోచ్ ద్వారా అబ్దుల్ నవీ మహ్మద్ శిక్షణ ఇస్తున్నారు.

ఉద్యోగాల్లో రిజర్వేషన్లు

షూటింగ్ సాధన చేయడం ద్వారా విద్యార్థుల్లో ఏకాగ్రత పెరగనుంది. అంతేకాక క్రీడాకారులు మానసికంగా దృఢంగా తయారవుతారని చెబుతున్నారు. ఇక నిరంతరం శిక్షణ ద్వారా జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిస్తే రాష్ట్రస్థాయికి అక్కడి నుంచి జాతీయస్థాయి పోటీల్లో అవకాశం దక్కుతుంది. అంతేకాక జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిస్తే ఉద్యోగపరంగా అవకాశాలు మెరుగువుతాయి. ఆర్మీ, పోలీస్, స్పెషల్ ఫోర్స్, సీఐఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, నేవీ, విమానాశ్రయాల భద్రత దళంలో పనిచేసేందుకు అర్హత సాధించనున్నారు.

జిల్లాలో మొదటి షూటింగ్ రేంజ్



శ్రీరామచంద్ర కళాశాలలో శిక్షణ షూటింగ్ రేంజ్ ఏర్పాటుచేశాం. వారం రోజుల్లో ప్రారంభమవుతుంది. ఇప్పటికే 33 మందికి శిక్షణ ఇస్తున్నాం. షూటింగ్‌లో రాణించడం ద్వారా ఉన్నత చదువులు, ఉద్యోగాల్లో అవకాశాలు మెరుగవుతాయి.

–అబ్దుల్ నవీ, కోచ్

క్రీడాకారులకు ఉపయోగం



జిల్లాలోనే మొదటిసారి రైఫిల్ షూటింగ్ ఏర్పాటు చేశాం. ఇలాంటి శిక్షణ హైదరాబాద్‌లోనే ఉంటుంది, కలెక్టర్ ప్రోత్సాహంతో దీన్ని ఏర్పాటు చేయడం ద్వారా గిరిజనులు, ఔత్సాహికులకు మంచి అవకాశం లభించినట్లవుతుంది.

–పరంధామరెడ్డి, జిల్లా యువజన, క్రీడల అధికారి


విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న కోచ్ అబ్దుల్ నవీ

రికార్డు స్థాయిలో ఉత్పత్తి

- విజయవంతంగా 100 రోజుల మైలురాయి దాటిన 500 మెగావాట్లు
- కేటీపీఎస్ 6వ దశలో హర్షాతిరేకాలు


సీఈకి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

పాల్వంచ: రాష్ట్రానికి వెలుగులు పంచే కేటీపీఎస్ కర్మాగారం అరుదైన రికార్డులకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. ఈ క్రమంలో ఎలాంటి అవాంతరాలు లేకుండా ఉత్పత్తి సాధిస్తూ కీలకంగా మారుతోంది. కేటీపీఎస్ 6వ దశ కర్మాగారంలోని 11వ యూనిట్ 500 మెగావాట్లను నిర్విరామంగా ఉత్పత్తి చేస్తోంది. ఈ క్రమంలో గురువారానికి వందరోజుల మైలురాయిని పూర్తి చేసుకుంది. సెప్టెంబర్ 3వ తేదీ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అవాంతరాలు లేకుండా నడుస్తోంది. సమష్టి కృషి, ముందస్తు ప్రణాళికలు, నాణ్యతతో కూడిన ఉత్పత్తితోనే విజయం సాధించినట్లు ఉద్యోగులు చెబుతున్నారు. దీంతో కర్మాగారంలో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.

గతంలోనూ అరుదైన రికార్డులు

ఈ యూనిట్ గతంలోనూ అరుదైన రికార్డులు సొంతం చేసుకుంది. ఎలాంటి ఆటంకాలు లేకుండా ఉత్పత్తిని అందించింది. ఉన్న యూనిట్లలో 500మెగావాట్లు అందించేది 6వ దశలోని 11వ యూనిట్ కావడం విశేషం. 2016 సెప్టెంబర్ 26వ తేదీ నుంచి 2017 మార్చి 14 వరకు 168 రోజుల పాటు ఉత్పత్తి అందించింది.

- 2020 ఫిబ్రవరి 3వ తేదీ నుంచి 2020 అక్టోబర్ 16వ తేదీ వరకు నడిచి రికార్డు స్థాయిలో 256 రోజులపాటు ఉత్పత్తిని అందించింది.
- 2023 జనవరి 15వ తేదీ నుంచి 2023 జూన్ 4వ తేదీ వరకు 139రోజుల పాటు ఉత్పత్తి అందించింది.
- ఇప్పుడు 100 రోజుల ఉత్పత్తిని పూర్తి చేసుకుని ఎలాంటి ఆటంకాలు లేకుండా నడుస్తోంది.

6వ దశలో సంబురాలు

కేటీపీఎస్ 6వ దశ కర్మాగారంలోని 11వ యూనిట్ విద్యుత్ ఉత్పత్తిలో వంద రోజుల మైలురాయి దాటడంతో శుక్రవారం సంబురాలు జరిపారు. యూసీబీ హాల్‌లో సీఈ ఎం.ప్రభాకర్‌రావు కేక్ కట్ చేశారు. మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఈలు వి.వెంకటేశ్వర్లు, టి.సత్యనారాయణ, జీవీ ధర్మారావు, పి.కృష్ణ, బి.మోక్షవీర్, డీవైసీసీఏ పి.రామారావు, ఎస్‌పీఎఫ్ ఆర్ఐ కిరణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కాగా, కేటీపీఎస్ 6వ దశలోని 11వ యూనిట్‌లో వంద రోజుల పాటు విద్యుత్ ఉత్పత్తి చేయడంపై తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం సీఈ ఎం.ప్రభాకర్‌రావు, ఎస్ఈ జి.ధర్మారావును కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కూరపాటి రమేశ్, వరకూటి శ్రీనివాసరావు, రజిత, దాసరి వెంకటేశ్వర్లు, కీర్తి, భాగ్యరాజు, పాడెం కృష్ణ, కన్నయ్య, తంబాల వెంకటేశ్వర్లు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో ఉత్పత్తి

సమష్టి కృషితోనే ఉత్పత్తి సాధించగలుతున్నాం. 500 మెగావాట్లలో ఎలాంటి అవాంతరాలు లేకుండా 100 రోజులు పూర్తి చేసుకుంది. ఇదే స్ఫూర్తితో ఇంజనీర్లు, ఉద్యోగ, కార్మికులు మరింత శ్రద్ధతో పనిచేయాల్సిన అవసరం ఉంది.

–ఎం.ప్రభాకర్‌రావు, సీఈ, కేటీపీఎస్ 5, 6 దశలు

కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు కసరత్తు

'సాక్షి' కథనానికి స్పందన


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

చండ్రుగొండ: మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై ఎమ్మెల్యే జారే ఆదినారాయణ స్పందించారు. రైతుల కష్టం.. దళారుల పాలు అనే శీర్షికన శుక్రవారం (13 తేదీన) 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం విదితమే. స్పందించిన కాంగ్రెస్ నాయకులు శుక్రవారం రాత్రి దమ్మపేటలో ఎమ్మెల్యేను కలిశారు. అన్నదాతలు పడుతున్న విషయంతోపాటు సాక్షి కథనాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే కలెక్టర్ జితేశ్ వి.పాటిల్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లు సమాచారం. ఎమ్మెల్యేని కలిసిన వారిలో నాయకులు భోజ్యానాయక్, సారేపల్లి శేఖర్, కీసరి కిరణ్‌రెడ్డి, ఫజల్, బన్నే నాగరాజు ఉన్నారు.

చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుతో ఆర్థికాభివృద్ధి


మాట్లాడుతున్న పీఓ రాహుల్

భద్రాచలం: గిరిజనులు చిన్న తరహా పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా ఎదగడం ద్వారా ఇంకొందరికి ఆదర్శంగా నిలవాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. భద్రాచలంలో శుక్రవారం ఎంఎస్ఎంఈ యూనిట్ల ద్వారా చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ.. రుణం తీసుకుని యూనిట్ల ఏర్పాటుకు ముందుకొచ్చే వారికి రిజిస్ట్రేషన్, మార్కెటింగ్ తదితర అంశాల్లో ఐటీడీఏ సహకరిస్తుందని చెప్పారు. ఇదేసమయాన సభ్యులు తయారు చేసే వస్తువులను స్థానికంగా మార్కెటింగ్ చేసుకోవాలని సూచించారు. అన్ని సీజన్లలో లభించే ముడిసరుకుతో ఉత్పత్తులు రూపొందించి లాభాలు గడించడమే కాక ఇంకొందరికి ఉపాధి కల్పిస్తే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని తెలిపారు. కొన్నిచోట్ల యూనిట్ల సభ్యులు అజాగ్రత్తగా వ్యవహరిస్తున్నారని, వారు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. త్వరలోనే ఐటీడీఏ ప్రాంగణంలో ట్రైబల్ మ్యూజియం ప్రారంభిస్తున్నందున పర్యాటకుల కోసం ఆదివాసీ వంటకాలు, హ్యాండీక్రాఫ్ట్‌లు తదితర స్టాళ్లు ఏర్పాటు చేయనున్నట్లు పీఓ తెలిపారు. సమావేశంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ఉదయ్‌కుమార్, హరికృష్ణ పాల్గొన్నారు.

వృత్తివిద్యా నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

బూర్గంపాడు: యువత వృత్తి విద్యానైపుణ్యాలను పెంచుకోవడం ద్వారా స్వశక్తితో జీవనోపాధి సృష్టించుకోవచ్చని ఐటీడీఏ పీఓ రాహుల్ తెలిపారు. బూర్గంపాడు గౌతమిపురం కాలనీలోని ఐటీసీ ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్‌ను శుక్రవారం సందర్శించిన ఆయన యువకులకు ఇస్తున్న ఎలక్ట్రికల్ శిక్షణను పరిశీలించి మాట్లాడారు. ఆతర్వాత రెండు నెలల శిక్షణ పూర్తిచేసిన యువతకు పీఓ సర్టిఫికెట్లు అందించారు. ఐటీసీ పీఎస్‌పీడీ జనరల్ మేనేజర్(హెచ్ఆర్) చెంగలరావుతో పాటు హరికృష్ణ, నరేష్‌కుమార్, శ్రీనివాస్, అజయ్‌కుమార్, జోష్టాదేవి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి అక్రమ దత్తతపై కేసు

జూలూరుపాడు: మూడు నెలల చిన్నారిని అక్రమంగా దత్తత ఇచ్చిన తల్లిదండ్రులు, దత్తత తీసుకున్న దంపతులపైన శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన గిరిజన దంపతులకు అక్టోబర్ 4న రామవరం (కొత్తగూడెం) మాతా శిశు ఆస్పత్రిలో మూడో కాన్పులో ఆడపిల్ల పుట్టగా అదే రోజు లక్ష్మీదేవిపల్లికి చెందిన దంపతులకు రూ.లక్షకు విక్రయించినట్లు తెలిసింది. శుక్రవారం ఐసీపీఎస్ అధికారులు లత, శేషు, సందీప్‌తోపాటు కొమ్ముగూడెం సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎం.లక్ష్మి కలిసి గిరిజన దంపతుల ఇంటికి వెళ్లి విచారించారు. భర్త, కొడుకులకు యాక్సిడెంట్ జరిగిందని, ఆర్థిక పరిస్థితి సక్రమంగా లేక, కుటుంబపోషణ కష్టతరంగా మారడంతో చిన్నారిని దత్తత ఇచ్చానని, పెంచుకోవడానికి ఇచ్చానని రెండు విధాలుగా ఆ మహిళ చెప్పినట్లు తెలిసింది. ఈ ఘటనపై కొమ్ముగూడెం సెక్టార్ అంగన్‌వాడీ టీచర్ ఎం.లక్ష్మి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. దత్తత ఇచ్చిన గిరిజన దంపతులు, దత్తత తీసుకున్న దంపతులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ మల్లయ్య చెప్పారు.

యువకుడిని బలిగొన్న మధ్యవర్తిత్వం..!

- మృతదేహంతో మృతుడి బంధువులు, కుటుంబీకుల ఆందోళన
- నలుగురిపై కేసు నమోదు..


దోమల ప్రణయ్ (ఫైల్)

కరకగూడెం: మధ్యవర్తిత్వం మంచికి కాకుండా ఓ యువకుడి ప్రాణాల మీదకు తెచ్చింది. మండలంలోని చిరుమళ్ల గ్రామానికి చెందిన దోమల ప్రణయ్ (22) 108 వాహన ఈఎంటీగా కరకగూడెంలో పనిచేస్తున్నాడు. పినపాక మండలం ఈ–బయ్యారం గ్రామానికి చెందిన 108 వాహన పైలెట్ ఉమ్మ సుబ్బారెడ్డితో పరిచయం ఏర్పడింది. ప్రణయ్ మధ్యవర్తిత్వంతో కరకగూడెం మండలానికి చెందిన కొందరు యువకులకు సుబ్బారెడ్డి వడ్డీకి నగదు ఇప్పించాడు. వారు ఎంతకూ నగదు తిరిగి చెల్లించకపోవడంతో అతను ప్రణయ్ ద్విచక్రవాహనాన్ని తీసుకెళ్లాడు. తీవ్ర మనస్తాపానికి గురైన ప్రణయ్ అయ్యప్ప మాలధారణలో ఉండి గత నెల 30వ తేదీన గడ్డిమందు తాగాడు. ఈ నెల 2న ఇరుముడి కట్టుకొని శబరిమలై వెళ్లి దర్శనం అనంతరం తిరుగుప్రయాణంలో 6వ తేదీన విజయవాడకు వచ్చాక ఆరోగ్య పరిస్థితి విషమించింది. బంధువుల సాయంతో ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. అప్పుడు జరిగిన విషయాన్ని కుటుంబీకులకు వివరించాడు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. కాగా, ప్రణయ్ మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ శుక్రవారం అతడి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు మృతదేహంతో ఈ–బయ్యారం క్రాస్ రోడ్డు, కరకగూడెం ప్రధాన సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ–బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ రాజ్‌కుమార్ అక్కడికి చేరుకొని ఆందోళన విరమింపజేశారు. సుబ్బారెడ్డి, కరకగూడెం మండలానికి చెందిన రావుల తేజ, సిరిశెట్టి రవితేజ, జెట్టి అభిరాంపై మృతుడి సోదరి నవ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.


ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఎస్ఐ రాజ్‌కుమార్

పల్టీ కొట్టిన కారు

ఒకరి పరిస్థితి విషమం, ఇద్దరికి గాయాలు


ఘటనా స్థలంలో క్షతగాత్రులు, పల్టీ కొట్టిన కారు

అశ్వారావుపేటరూరల్: కారు అదుపుతప్పి పల్టీ కొట్టిన ఘటనలో ఓ యువకుడి పరిస్థితి విషమంగా మారింది. మరో ఇద్దరు యువకులు గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని ఓ ఐరన్ షాపు యజమాని తన వద్ద పని చేసే గుమాస్తాకు కారును సర్వీసింగ్ చేయించాలని గురువారం రాత్రి తాళం ఇచ్చాడు. ఈ క్రమంలో షాపు బంద్ చేసిన తర్వాత గుమాస్తాతోపాటు మరో ఇద్దరు స్నేహితులు కలిసి అర్ధరాత్రి సమయంలో ఊట్లపల్లి వెళ్లి మద్యం సేవించి తిరిగి అశ్వారావుపేటకు వస్తున్న క్రమంలో వేగంగా నడుపుతూ, సడన్ బ్రేక్ వేయడంతో ఒక్కసారిగా అదుపు తప్పి పల్టీ కొట్టింది. కారులో ఉన్న దొంతికుంటకు చెందిన కాసుమాల వెంకన్నబాబు అలియాస్ గణపతికి తీవ్ర గాయాలు కాగా, ఎం.ప్రవీణ్, ఎం.సాయి గాయపడ్డారు. స్థానికులు వారిని ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉన్న గణపతిని ఖమ్మం ఆస్పత్రికి తరిలించారు. మిగతా ఇద్దరిని కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. కారు పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని, ఇంకా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందలేదని ఎస్ఐ యయాతిరాజు తెలిపారు.

ఇసుక నిల్వలు సీజ్

ములకలపల్లి: అక్రమంగా నిల్వ చేసిన ఇసుక రాశులను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. తహసీల్దార్ గుడ్ల పుల్లారావు కథనం మేరకు.. మండలంలోని పలు గ్రామాల శివార్లలో ఇసుక అక్రమంగా నిల్వచేస్తున్నట్లు సమాచారం రావడంతో గురువారం అర్ధరాత్రి తహసీల్దార్ గుడ్ల పుల్లారావు, ఆర్ఐ–2 భద్రు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనందపురం శివారులోని రిసార్ట్ సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన రెండు లారీల ఇసుకను సీజ్ చేసి శుక్రవారం తహసీల్దార్ కార్యాలయానికి తరలించామని తహసీల్దార్ తెలిపారు.

కొవ్వూరు రైల్వేలైన్‌కు నిధులు

కొత్తగూడెంఅర్బన్ /చుంచుపల్లి : భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్ నుంచి కొవ్వూరు రైల్వే లైన్‌కు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినివైష్ణవ్ రూ.2,700 కోట్లు మంజూరు చేశారని కొవ్వూరు రైల్వేలైన్ సాధన కమిటీ కన్వీనర్ కొదమసింహం పాండురంగ చార్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం నిధుల్లో సగం నిధులు మంజూరు చేసి జనవరి నుంచి పనులు మొదలుపెట్టానున్నరని వివరించారు. నిధుల మంజూరుకు సహకరించిన ప్రధాన మంత్రి మోదీ, రైల్వే శాఖ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా, నిధుల మంజూరుపై మహబూబాబాద్ మాజీ ఎంపీ సీతారాంనాయక్, బీజేపీ నాయకుడు తాండ్ర వినోద్‌రావు హర్షం వ్యక్తం చేశారు.

డబుల్ రిజిస్ట్రేషన్‌పై కేసు

రఘునాథపాలెం: మండలంలోని కోటపాడుకు చెందిన ఒక రైతు తన వ్యవసాయ భూమిని ఇద్దరికి రిజిస్ట్రేషన్ చేసిన ఘటనలో చీటింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు. భద్రాది కొత్తగూడెం జిల్లా ఇల్లెందుకు చెందిన శ్రావణ్‌కుమార్ 2015లో కోటపాడులో కొంటెముక్కల వెంకటేశ్వర్లు వద్ద మూడెకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఆ భూమిని వెంకటేశ్వర్లుకే కౌలుకు ఇస్తుండగా అనారోగ్యం కారణంగా శ్రావణ్‌కుమార్ భూమి వద్దకు రాలేదు. దీంతో 2018లో ధరణి ఏర్పాటైన సమయాన వెంకటేశ్వర్లు భూమిని తిరిగి తన పేరిట నమోదు చేయించుకుని పట్టాదారు పాస్‌పుస్తకం పొందాడు. ఆపై శివాయిగూడేనికి చెందిన సీహెచ్ ప్రదీప్‌కుమార్‌కు అమ్మి రిజిస్ట్రేషన్ చేశాడు. ఈ విషయం శ్రావణ్‌కుమార్‌కు ఇటీవల తెలియడంతో ఆయన వద్ద పనిచేసే వి.వెంకటాయపాలెంనకు చెందిన మూడ్ శంకర్‌తో ఫిర్యాదు చేయించగా వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గంజాయి రవాణా చేస్తున్న బాలుడి అరెస్టు

చర్ల: గంజాయిని తరలిస్తున్న బాలుడిని పోలీసులు అరెస్టు చేశారు. దుమ్ముగూడెం సీఐ బి.అశోక్ కథనం మేరకు.. పాల్వంచకు చెందిన 17ఏళ్ల బాలుడు తన స్నేహితుల కోసం ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసి ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. శుక్రవారం దుమ్ముగూడెం పోలీసులు ములకపాడు క్రాస్‌లో చేపట్టిన తనిఖీల్లో పట్టుబడ్డాడు. బాలుడి నుంచి 1.120 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ తెలిపారు.

ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య


జూలూరుపాడు: అనారోగ్య సమస్యతోపాటు పెళ్లి కావడం లేదనే మనస్తాపంతో ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. హెడ్‌కానిస్టేబుల్ దయానంద్ కథనం ప్రకారం.. పాపకొల్లు గ్రామ పంచాయతీ బచ్చలకోయగూడెంనకు చెందిన బత్తుల రాజేశ్ (25) నాలుగేళ్ల కిందట మోటార్ సైకిల్ పైనుంచి కిందపడటంతో కాలిమడమ భాగంలో తీవ్ర గాయమైంది. ఎంతకూ నొప్పి తగ్గకపోవడంతో మనస్తాపం చెందాడు. పెళ్లి కూడా కాకపోవడంతో ఒంటరితనాన్ని భరించలేక గురువారం అర్ధరాత్రి ఇంటి బయట రేకులషెడ్డు దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి బత్తుల అబ్బయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ దయానంద్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్‌ఎంపీ మృతి


లక్ష్మయ్య (ఫైల్)

టేకులపల్లి: బైక్ అదుపుతప్పి కింద పడి ఆర్‌ఎంపీ మృతిచెందిన ఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ సురేశ్ కథనం ప్రకారం.. మండలంలోని కిష్టారం గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ కంగల లక్ష్మయ్య(35) గురువారం రాత్రి హైదరాబాద్ నుంచి రైలులో వచ్చి.. మహబూబాబాద్ నుంచి బైక్‌పై కిష్టారం గ్రామానికి బయలుదేరాడు. శుక్రవారం తెల్లవారుజామున సుమారు 4గంటల సమయంలో తొమ్మిదోమైలుతండా దాటాక గులాయిగడ్డ వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కన ఓ దిమ్మెను ఢీకొని తీవ్రంగా గాయపడి, అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు రోడ్డు పక్కన పడి ఉన్న వ్యక్తిని చూసి పోలీసులకు సమాచారం అందించగా వారు వచ్చి మృతదేహాన్ని ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తండ్రి మారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెల్లడించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

నామవరం వద్ద ఒకరు..


మృతి చెందిన అనిల్

అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ): మండలంలోని నామవరం గ్రామం వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. పెట్లం గ్రామానికి చెందిన కుక్కముడి అనిల్ (30) మరో కూలీ మాయర రామకృష్ణ జామాయిల్ కర్ర నరికేందుకు ఉదయం వెళ్లారు. తిరిగి రాత్రి ఆటోలో వస్తుండగా నామవరం వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్.. ఆటోను ఢీకొట్టింది. ముందు కూర్చున్న అనిల్ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన రామకృష్ణను చికిత్స నిమిత్తం కొత్తగూడెం తరలించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.